


కొంపలు కాలిపోతోన్నట్టూ, తాగేసి తన్నుకుంటున్నట్టూ, తుఫాను ఒచ్చేసినట్టూ గోల గోల! గొడవ! రొద రొద! గంద్రగోళం!!

చెవులు చిల్లులుపడిపోతాయేమో అన్పిస్తోంది! బుర్ర పిచ్చెక్కిపోతుం దేమో! ఆ గోలకమాంతం హార్ట్‌ఎటాక్ వచ్చేస్తుందేమో? అయింతా హరీ మంటాడేవో? ఆ వెధప దిక్కుమాలిన పాడుగోల కాదు గాని....

విసుక్కుంటూ, తిట్టుకుంటూ, మూలుగుతూ ఆ వైపుకెళ్ళేడు శాస్త్రి. కావి... వెళ్ళలేకపోయేడు. వెనక్కి వచ్చేసేడు. అక్కడికెళ్ళడం పద్మవ్యూహంలోకి వెళ్ళడమే! తన భిమన్యుడు కాదు గదా!? ఒకవేళ వెళ్ళేడో చచ్చేడే!

శాస్త్రి నాలుగడుగులు మళ్ళీ అటు వేసేడో లేదో నాలుగునాలుగుల కాకులు రివ్ రివ్ మంటూ ఒచ్చేసేయి మీది మీదికి. పిల్లని వ... ఇషంలేని మావలాగా ఒకటి పరమ క్రూరంగా 'విష్' చేసింది! పేకాటలో సర్వాంగ క్షవరం అయినవాడిని అవతలివాళ్ళు ట్రీట్ చేసినట్టు కొన్ని కాకులు విసురుగా, రవుడీజమ్‌గా ముక్కుల్తో, కాల్తో తన్నీసేయ్. కుమ్మీసేయి, పొడిచీసేయి!!

గుండె ఝల్లుమంది శాస్త్రికి. ఒళ్ళు గజ గజా వొణికిపోయింది. ఏవిటీ విపరీతం? ఏవిటీ దారుణం? నిన్నా, మొన్నా, "హాత్" అని అంటే, "పోన్లే అలాగేలే! పోతాన్లే" అనీ చక్కా ఎగిరిపోయేవే! అలాంటిది! ఇవాళ అస్సలు జడవడం లేదు సరిగదా... చచ్చినట్టూ పడి వుండే శ్రామికవర్గం, పేదలు, ఒక్కసారి విప్లవశంఖం పూరించినట్టూ–విజృంభించేస్తున్నాయేవిటి!?

"అటువైపు వెళ్ళకురా!" అవి అరిచింది శాస్త్రి చెల్లెలు పద్మ.

"కాకి పిల్ల గూటిలోంచీ పడిపోయిందిరా! అందుకే అవి అలాగ గోల గోల చేసేస్తున్నయ్!" అని చెప్పింది.

"ఓహో! అలానా?" అన్నాడు శాస్త్రి.

అంటూనే వున్నాడతను. అంతలో ఇంకో రెండు కాకులు వచ్చేసేయతడి మీదికి. రైఫిల్ పట్టుకొని శత్రువులు చంపడానికొచ్చేసినట్టూ శాస్త్రి వాటి బారి నుంచీ తప్పకుంటే మరో విలనుడొచ్చీ ఖర్చుకిచ్చీసేదు!

రెండే అంగల్లో ఇంట్లో కొచ్చీ పడిపోయాడు శాస్త్రి. "కాకిపిల్ల చచ్చిందేవిటే?" అనడిగేడు. "చావలేదురా"

"లేదూ! మరయితే అవలా అరచి ఛస్తాయేవిటే? తన్నీ పొడిచీ ఛస్తాయేం?"

"వాటిక్కోపంగా వుందిరా! వాటి పిల్లని మనం తీసేసి, ధ్దాచేసేవనీ..."

"పాపం కాకిపిల్ల దాని గూట్లోంచీ కింద, నేల మీద పడిపోయిందిరా! బిక్కు బిక్కుమంటూ చూస్తోంటే, తిండి లేక ఆ పిల్లముండ అయింతా చచ్చి వూరుకుంటుందేమోనవీ, ఇంట్లోకి మెల్లిగా ఎత్తుకొచ్చేసేన్రా!!"

"అలాగా? ఏదీ అది?"

పద్మ పెరడువయిపున్న చిన్న గది దగ్గరికెళ్ళింది. ఆ చిన్న గదిలో పనికిరాని సామాన్లవీ పడేస్తారు. ఆ గదిలో ఒక్క చెక్క పెట్టెలో ఆ కాకిపిల్లని దాచింది పద్మ. పిల్లులు తినీకుండా దాన్నక్కడ వుంచి దానికి అన్నం మెతుకులవీ పెడ్తోంది!

శాస్త్రికి ఆ రోజు ఆ విధంగా జరిగినదంతా తెలియదు. ఆఫీసు పని మీద రెండ్రోజులు పై వూరెళ్ళి ఒచ్చేడు. రాత్రి పెరట్లోకెళితే కాకి గోల లేదు! ఆశ్చర్యపోయి అడిగితే రాత్రి కాకులు గూళ్ళని వదలి బైటకి రావని చెప్పింది. పద్మ చేసిన పనికి అవి మరింత రెచ్చిపోయేయి. పద్మ ఇల్లు దాటి ఒక్క అడుగు పెరటివయిపు గాని, వీథి వయిపుగావి పెడితే చాలు! చేతి మీదో గాటు, బుగ్గ మీదో పోటు. తల మీద పరేసరి! తట్టెడు తన్నులు. "ఎందుకొచ్చిన తద్దినవే? పారెయ్యవే" అంది తల్లి

**మాతృభాష**

కొడుకు: మాతృభాష అని ఎందుకంటారు?

తండ్రి: తండ్రికి మాట్లాడే అవకాశం తక్కువ కాబట్టి.

— ఫన్నీ వమ్మ

"ఎలాగమ్మా? బైట పారేస్తే ఏ గండుపిల్లో తినేస్తుందే"

"అది ఛస్తుందనీ నువ్వు ఛస్తావటే? నీకిదేం ఖర్మమే? తాగుబోతు మొగుడిచేత తన్నించుకున్నట్టూ... ?"

శాస్త్రి ఆ కాకిపిల్లని చూసేడు. అంత గోలకీ తనే కారణం అయినా– "నేనేం ఎరగను సుమా" అన్నట్టు చూస్తోందది! ఎర్రటి నోరంతా తెరిచేసి "మీరేం ఛస్తే నాకేం? నాకేం పెడ్తావ్? కావ్? నాకాకలేస్తోందేవ్ కావ్!"

శాస్త్రి జాలిపడ్డాడు. నిజమే! కాకిపిల్లని బైట పారేస్తే నిష్కారణంగా బలి అయిపోతుంది. దాన్ని మనుషులు ముట్టుకున్నారనీ, అంత గోల చేస్తున్న కాకులు, దాన్ని బయట పడవేస్తే గూటిలోకి తీసుకుపోతాయా? అబ్బే! వాటి గూటికి తీసుకెళ్ళవని. దాన్ని చుట్టూ అరవడం తప్ప. ఇంత తొండ పిసరేనా పెట్టవ్. అదేం వెధవ బుద్ధి? అది గూట్లో వుంటేనే వుయ్యాల్లో పిల్లకి, వూరంత ముద్దు చేసినట్టూ మురిపంగా, మమకారంగా చూస్తాయి.

తన స్నేహితుడు రాజు వస్తే శాస్త్రి వీధిలోకెళ్ళాడు. రాజుతో మాట్లాడుతూ ఆ వైపు ఆశ్చర్యంతో చూసాడు. ఆ వీధి చివర్లో ఒక చింత చెట్టుంది. ఆ చెట్టు కింద నీడలో ఒక ఆడది ప్రక్కన పసికందుని పడుకోబెట్టుకొని తను పడుకుంది.

"ఎవర్రా రాజూ?" అనడిగేడు శాస్త్రి ఆమెని చూపించి.

"మధ్యాహ్నం ఈ వీధిలోకి వచ్చింది. సాయంత్రం పిల్ల పుట్టింది! వీధిలో వాళ్ళు అన్నం పెట్టేరు. అదిగో ఆ చింత చెట్టు క్రింద నీడన పడుకుంటోంది..."

స్నేహితులిద్దరూ అటు వెళ్ళేరు. మనిషి కనబడ్తే మాదాకవళం అడక్క తప్పదన్నట్టూ– ఆ బిచ్చకత్తె లేచి "బాబూ" అని చెయ్యి చాచింది. రాజు, శాస్త్రి చెరో అర్ధరూపాయి వేసేరు. ఆ చిరుగుల దుప్పటి మీద, నెమ్మదిగ కదులుతోన్న చిన్న ప్రాణిని చూస్తే, అతడికి తమ పెరటిగదిలో, చెక్క పెట్టిలోని కాకి పిల్ల గుర్తుకు వచ్చింది.

..... ఆ రోజంతా కూడా కాకులు, తమ సమీప ప్రత్యర్థుల్ని అదరగొడ్తూనే వున్నాయి!!

"... క్యావ్ క్యావ్ క్యావ్! దీన్నీ పిల్లని తన్నండి తన్నండి కొట్టండి! పొడిచింది! ఇదెంత పని చేసిందేవ్ కావ్! మన పిల్లని అది ముట్టుకుంటుందేవ్ కావ్! ఇంట్లో దాచీస్తుందేవ్ కావ్! దీన్నే కాదేవ్ కావ్! దీన్లాంటి మనుషులందర్నీ పొడిచిందేవ్ కావ్! వీళ్ళు దుర్‌మార్‌గులేవ్ కావ్ కావ్ కావ్!"

బలమైన శత్రుసైన్యం ఒక్కుమ్మడిగ దాడి చేస్తే, బలహీన దేశం ఏం చేయగలదు! అలాగే వున్నాది, శాస్త్రి ఇంటి పరిస్థితి! అక్కడికీ వాళ్ళు ఓపిక, బలమూ తెచ్చుకుని కర్రల్తో అడ్డుకుంటూ, ఎదిరిస్తూ, అదలిస్తూ పెరడు వైపు, వీధి వైపు వెళ్ళివస్తున్నారు.

శాస్త్రి మళ్ళీ వీధిలోకి వెళ్ళేసరికి– ఆచోట పెద్ద గోలగా వున్నాది

అక్కడ వున్న బిచ్చ కత్తె అలోపాలో మంటూ ఏడుస్తోంది! కేకలేస్తోంది! తిడ్తోంది! ఎవర్ని తిడ్తోందని శాస్త్రి కుతూహలంతో ఆత్రంతో అటు వెళ్ళాడు.

ఆ బిచ్చగత్తెకి సమీపంలో ఓ పదేళ్ళ కుర్రవాడున్నాడు. వాడి వొంటి మీద మాసి, చిరుగుల్తో వున్న నిక్కరొక్కటే వున్నాది. వాడి జుత్తు తెగ పెరిగి దుమ్ముతో వుంది. వాడి ఎముకలు ఎక్సరేతో నిమిత్తం లేకుండా ఎక్స్‌పోజవుతున్నాయి. ఆ బిచ్చగత్తె వాడిమీద కెళ్ళి జుత్తు పట్టుకుని ఎడాపెడా బాదేసింది. అప్పుడు దాని కళ్ళెలా వున్నాయి? అచ్చు కాళికాదేవి కళ్ళలా వున్నాయి! దాని చూపులు సెగలూ పొగలూ కక్కుతున్నాయి. దాని జుత్తు విడిపోయీ, చెలరేగీ వీపు అంతా పరచుకుంది.

"దొంగనాయాలా ఏటి సేస్తన్నావ్‌రా, నా పిల్లనీ! దాన్ని ఎత్తుకెల్లిపోతావేటొరే! దాని కల్లు పొడిసేస్తావెటొరే? దాన్ని గుడ్డి ముండని సేసీసీ, డబ్బు లడుక్కుంటావేటొరే? శవాన్ని సేసీసీ అడుక్కుందాంనా?"

ఆ తరవాత దాని రధం అక్కడున్న జనం మీదికి తిరిగింది.

"సూడండి బాబూ! నేనీ బిడ్డ నొదిలీ అట్టా కాసింత దూరానికెల్లేనో... నేదో... ఈడు నా బిడ్డ కాడకొచ్చీనాడు సూడండి... నాన్సూడబట్టి ఒక్కూపులో ఆడి మీద పడిపోయి లాగేసుకున్నాను... నేకుంటే ఎంత పనయిపోనో గందా?"

దాని మాటలు ఆలకించిన కొంతమంది ఆ కుర్రాణ్ణి తిట్టిపోసేరు; కొంతమంది మాత్రం వినోదంగా చూస్తున్నారు!

ఆ కుర్రాడెలాగో ఆ బిచ్చగత్తె బారినించీ విడివడీ, దూరానికెళ్ళేడు. శాస్త్రి కెందుకో వాడి మీద కోపం రావడం లేదు. వాడిలో "దొంగ, దుర్మార్గుడూ" కనబట్టం లేదు శాస్త్రికి. వాడిలో కేవలం దైన్యం, నిస్సహాయతే ద్యోతకం అవుతున్నయ్!

శాస్త్రి వాణ్ణి పిలిచేడు.

"ఏరా? నిజం చెప్పరా? ఆ పిల్లని ఎందుకెత్తుకెళ్ళేవు?"

వాడు బుర్రని అడ్డంగా తిప్పేడు.

"నానేం దొంగనీ, దురమార్గుణ్ణీ కానండీ..." అని మొదలుపెట్టీ ఆ కుర్రాడు జరిగిందేమిటో వివరించేడు.

ఆ పసిపిల్లని ఒంటరిగ వదిలీ, ఆ బిచ్చగత్తె ఏ అవశిష్టం తీర్చుకొందికో, కాస్త దూరంగా వెళ్ళిన సమయంలో – ఆ కుర్రాడటుగా వస్తూ చూస్తే,

ఓ వూర కుక్క గబగబ అలా వచ్చీ, ఆ పురిటి కందు దగ్గరగా వెళ్ళీ, వాసన చూస్తోంది. ఆ అబ్బాయా కుక్క ఏం చేస్తుందో అని భయపడిపోయి,, అదలించీ, తోలీసీ ఆ పిల్లని ఎత్తుకున్నాడు. అదే ఆ పిల్లవాడు చేసిన పని... అదే వాడి నేరం!! ఆ బిచ్చగత్తె వాడి మీద అనుమానపడి, భయపడి, వాడి మీద దాడి చేసేసింది;

శాస్త్రి ఆ కుర్రవాణ్ణి అక్కడి నించీ పంపించివేశాడు.

ఇంటికెళ్ళి చెల్లెలికి ఆ కబురు చెప్పేడు.

పెరడులో కాకులు గోల పెడ్తోనే వున్నయ్.

వీధిలో ఆ బిచ్చగత్తె ఆ కుర్రాణ్ణి తిడ్తోనే వున్నాది.

ఆ కాకులదీ, దానిదీ కడుపు ఘోషే!!

ఆ రెండు సంఘటనకీ వున్న సామ్యాం గురించీ తల పోస్తున్నాదు శాస్త్రి. ●